క్లుప్తంగా

హిందూ ఐక్యవేదిక నిరసన



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు మిన్నంటాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, వెస్ట్‌బెంగాల్‌లో ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. విశ్వహిందూ పరిషత్, బీజేపీ, భజరంగ్‌దళ్ నేతలు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, చేపూరి అశోక్, నాగుల శ్రీనివాస్, గుడ్ల విష్ణు, గర్రెపెల్లి ప్రభాకర్, చొప్పదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సిరిసిల్లటౌన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేతన్నచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. మృతిచెందిన వైద్య విద్యార్థినికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న వైద్యులకు రక్షణ కల్పించాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డులు అందజేత

వేములవాడఅర్బన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాల ప్రధానోత్సవం హైదరాబాద్‌లో శనివారం నిర్వహించారు. వేములవాడ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ట్రాఫిక్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, కండక్టర్లు ప్రమీల, నర్సింహులుకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతులమీదుగా అవార్డులను అందించినట్లు వేములవాడ డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో చికిత్స సరిగ్గా అందించలేదని సిరిసిల్లలో ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట శనివారం రాత్రి బంధువులు ఆందోళన చేపట్టారు. బంధువులు మీడియాతో మాట్లాడుతూ కోనరావుపేట మండలం ధర్మారం వద్ద బైక్‌పై వస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి ఆర్.వెంకట్రాజంను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి కంటే మెరుగైన వైద్యం కోసమని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించామన్నారు. ఆస్పత్రిలో రాత్రి వరకు సరైన వైద్యం అందించడంలో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతోనే వెంకట్రాజం మరణించాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రధాన కౌంటర్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు !

వేములవాడ: రాజన్న ఆలయంలోని ప్రధాన కౌంటర్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కౌంటర్లలో డబ్బులు తేడా వస్తే జేబులోంచి కట్టుకుని వారి గోడును ఉన్నతాధికారుల ముందుంచినట్లు తెలుస్తోంది. డీసీఆర్‌లలో లెక్కలు తేడాలొస్తే ఎలా అంటూ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఆలయ ఉన్నతాధికారులు దీనిపై శ్రద్ధ పెట్టకుంటే ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు

'స్తంభంపల్లి చెరువు నింపండి'

బోయినపల్లి: గంగాధర మండలం నారాయణపూర్ గ్రావిటీ కెనాల్ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాలతో మండలంలోని స్తంభంపల్లి చెరువు త్వరగా నింపాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు వినతిపత్రాలు అందించినట్లు వేములవాడ ఆలయ మాజీ చైర్మన్ చెన్నాడి కమలాకర్‌రావు శనివారం తెలిపారు. పనులు పూర్తి చేయడానికి రూ. 15కోట్ల మేర నిధులు వెచ్చిస్తే బోయినపల్లి, గంగాధర మండలాల్లోని రైతులకు కాల్వల ద్వారా చెరువుల్లోకి నీరు చేరి 15 వేల ఎకరాల్లో పంటలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

పెద్దఎత్తున హాజరుకావాలి

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఇస్కాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు 10వేల మందికి అన్నదానం పెట్టనున్నారు.ప్రజలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య పాలసిరులు

- రైతుల నుంచి నేరుగా కొనుగోలు.. పట్టణాల్లో అమ్మకాలు
- పాల కేంద్రాలుగా పట్టణ జంక్షన్లు
- ఆరోగ్యంపై ప్రజల దృష్టి

సండే స్పెషల్



సిరిసిల్లటౌన్/సిరిసిల్ల ఎడ్యుకేషన్: పట్టణ వాసుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. బిజీ జీవితం, ఆహార అలవాట్లు, పనుల్లో మార్పులతో చాలామందిలో ప్రొటీన్స్, విటమిన్స్ లోపాలు తలెత్తుతున్నాయి. మెరుగైన ఆరోగ్యం కోసం ఆవు, గేదె పాలను తాగుతున్నారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన పాలప్యాకెట్లను వినిగియోగించిన వారు ఇప్పుడు పల్లెల్లో నేరుగా పాడి రైతుల నుంచి వచ్చే పాలను కొనుగోలు చేసి ఇంటిల్లిపాది వాడుతున్నారు. ఈక్రమంలో పాలతో చిరు వ్యాపారులు, పాడి రైతులకు ఉపాధి సిరులు గుప్పిస్తున్న వైనంపై సండే స్పెషల్ కథనం..

పాడి రైతు టు.. వినియోగదారులు



గతంలో పాలు అమ్మేవారు వాడేవాడకు తిరిగి అవసరమైన పాలను పోసి వెళ్లేవారు. కొందరికి వాడుకరూపంలో నెలసరిగా డబ్బులు తీసుకొని సరఫరా చేసేవారు. వినియోగదారులు నాణ్యతగల పాలను కాంక్షిస్తున్న వైనాన్ని గమనించిన చిరు వ్యాపారులు నేరుగా పల్లెలకు వెళ్లి పాడిరైతులు, పాల శీతలీకరణ కేంద్రాల నుంచి తీసుకొచ్చి వినియోగదారులకు అందిస్తున్నారు. ఈక్రమంలో వందలాది సంఖ్యలో పాడి రైతులు, చిరు వ్యాపారులకు నిరంతర ఉపాధి దొరుకుతుంది.

రోడ్డు 'సైడు' ఉపాధి..

స్వచ్ఛమైన ఆవు, గేదెపాలను చిరు వ్యాపారులు రోడ్డుపక్కన, ఫుట్‌పాత్‌లపై, చిన్నచిన్న దుకాణల్లో అమ్ముతూ నిత్యం ఉపాధి పొందుతున్నారు. పాడి రైతుల నుంచి నేరుగా తీసుకొచ్చి అదే నాణ్యతతో చిరు వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. చిక్కటి పాలు అందించడంతో పట్టణ ప్రజలు వారి వద్ద కొనుగోలు చేయడానికి క్యూ కడుతున్నారు. పల్లెల నుంచి ఉదయమే పాలు రావడం వాటినే కస్టమర్లు తీసుకెళ్లడం సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నిత్యకృత్యమైంది. ఇందుకు చిరు ఉద్యోగులు ప్రధాన జంక్షన్లను అడ్డాగా చేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. అటు పాడిరైతులు, ఇటు చిరు వ్యాపారులకు ఉపాధితో పాటు రోజువారి ఆదాయం సమకూరుతుంది. .

డెయిరీలకు డిమాండ్

కాలానుగుణంగా ప్రజలకు బ్రాండెడ్ డెయిరీ పాల ప్యాకెట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం పల్లెల్లో వెల్లివిరుస్తున్న క్షీరవిప్లవం పట్టణవాసులకు ఆరోగ్యాన్ని పంచుతుంది. కరోనా తర్వాత తాజా, పరిశుభ్రత, సహజత్వంతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలనే ఆలోచన పెరిగింది. దీన్ని గమనించిన కొందరు రైతులు, వ్యాపారులు గ్రామాల్లో ఉన్న పాడి రైతులను కలిసి నేరుగా పాలను కొనుగోలు చేసి పట్టణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. ఈ అమ్మకానికి ప్రధాన కేంద్రాలుగా పట్టణ ప్రధాన రహదారులు జంక్షన్లు అడ్డాగా మారాయి. సిరిసిల్ల, వేములవాడ ప్రధాన జంక్షన్లలో ఒకప్పుడు ఒకటో రెండో పాల అమ్మకం కేంద్రాలుండగా ప్రస్తుతం వాటి సంఖ్య పదులకు చేరింది. వినియోగదారులు నేరుగా పాలను తీసుకెళ్లే సంస్కృతి పెరిగింది.

పాల వ్యాపారం ఇలా..

- రైతుల నుంచి లీటరు పాలను రూ.55 కు కొనుగోలు చేసి పల్లెల్లో రూ.70, పట్టణాల్లో రూ. 80 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు.
- పాలకేంద్రంలో రైతులు పాలు పోసేక్రమంలో వెన్నశాతం ఆధారంగా డబ్బు చెల్లింపుతో నష్టపోతున్నామని రైతులు తెలుపుతున్నారు.
- పాల కేంద్రంలో ధరల హెచ్చుతగ్గులు ఉండడంతో పాటు అనేక కొర్రీలు పెట్టడాన్ని భరించలేక పాలను పట్టణ వ్యాపారులకు అందిస్తే..రైతులకు ఎప్పటికప్పుడు నగదు ఆదాయం వస్తుంది.

నాణ్యతకు ప్రాధాన్యం



పదేళ్లుగా రోజూ వాహనంలో గ్రామాలకు వెళ్లి పాడిరైతుల నుంచి నేరుగా పాలను తీసుకుంటాం. సిరిసిల్లకు తీసుకొచ్చి అదే నాణ్యతతో కస్టమర్లకు అమ్ముతాం. గతంలో పాల నాణ్యతను బట్టి రెండు, మూడు రకాల ధరల్లో అమ్మేవాళ్లు. మేం ఒకే రకమైన నాణ్యమైన పాలు అమ్ముతాం. ఏవైనా మిగిలితే పెరుగు, వెన్న. పన్నీర్, నెయ్యి తయారు చేసి అమ్ముతాం.

– శ్రీనివాస్, పాల వ్యాపారి, సిరిసిల్ల

నిత్యం 200 లీటర్లకు పైగా



మాకు రేకుర్తి నుంచి ప్రతిరోజు వ్యాన్‌లో పాలు వస్తాయి. నిత్యం 200 లీటర్లకు పైగా పాలను విక్రయిస్తాను. రూ.7వేల నెలసరి జీతంతో అమ్ముతాను. పాలల్లో కల్తీ లేకుండా ఉండటంతో ప్రజలు తీసుకెళ్తున్నారు. నిత్యావసరం కాబట్టి నాలాంటి వాళ్లు సిరిసిల్లలో పదుల సంఖ్యలో పాలతో ఉపాధి పొందుతున్నారు.

గాండ్ల కిషన్, పాల విక్రయదారుడు

అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి, పొత్తూరు, వల్లంపట్ల, కేజీబీవీ, పాఠశాలల్లో శనివారం సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే 100కు సమాచారం ఇవ్వాలని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికలు ఆకతాయిలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్సై కె. శ్రీకాంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేరళ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలపై లైంగికదాడులు అధికమవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాయ మాటలను నమ్మి మోసపోవద్దన్నారు,. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టిసారించాలన్నారు. పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: మహిళలపై దాడులు జరిగితే తక్షణమే ఫిర్యాదు చేయాలని ఎస్సై సుధాకర్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సఖి, పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించారు. సఖీ కోఆర్డినేటర్ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత, పోలీస్ సిబ్బంది సంపత్, శ్రీనివాస్, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంట: మాట్లాడుతున్న సీఐ మొగిలి

యువత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



వేములవాడ: నేటి యువతరం ఆరోగ్యంపై దృష్టి సారించాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో పవర్‌జిమ్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలసి ప్రారంభించారు. జిమ్ నిర్వాహకులు శబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి శనివారం వేములవాడ అర్బన్ మండల సెస్ ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవా డ అర్బన్ మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తమదృష్టికి తీసుకురావాలన్నారు.



బోయినపల్లిలో రాధా కృష్ణుల వేషధారణలో చిన్నారులు



గంభీరావుపేట: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టి కొటట్టే వేడుకల్లో విద్యార్థులందరూ పాల్గొని సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఆయా పాఠశాలల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కోనరావుపేట : సుద్దాలలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు



వేములవాడ అర్బన్: శ్రీ చైతన్య పాఠశాలలో..



రుద్రంగి: చిన్నారుల నృత్యాలు



సిరిసిల్ల అర్బన్: సారంపల్లిలో..

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట ఒకటో వార్డులోని బోరుమోటారు ఎనిమిది నెలలుగా పనిచేయడం లేదు. దీంతో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బోరుమోటారుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

\- కూడెల్లి సత్యనారాయణ, లింగన్నపేట, గంభీరావుపేట మండలం



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఎంపీడీవో, గంభీరావుపేట సెల్ నంబర్: 9989930730

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048

నేడు విగ్రహావిష్కరణ

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ప్రారంభిస్తారని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ సావనపెల్లి రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , రాష్ట్ర ఫుడ్ కమీషన్ మెంబర్ ఒరుగంటి ఆనంద్, జిల్లా ఉన్నతాదికారులు, దళిత, బహుజన, ప్రజాసంఘాల రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొంటారన్నారు.

విద్యార్థులకు అవగాహన



వేములవాడఅర్బన్: పట్టణంలోని జ్యోతిబాపూలే పాఠశాల, జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు బాల్య వివాహలు, పోక్సో చట్టంపై వేములవాడ టౌన్ పోలీస్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అవగహన కల్పించారు. కార్యక్రమంలో వేములవాడ టౌన్ ఎస్సై రమేశ్, ఐసీడీఎస్ అధికారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గీతాంజలి

ముస్తాబాద్: బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పోతుగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి గీతాంజలి అన్నారు. శనివారం పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, చేపలు, తృణధాన్యాలను తరచూ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.సూపర్‌వైజర్ పూల, హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

బోయినపల్లి: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బకాయిలు, వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగ జిల్లా కారదర్శి గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం మిడ్‌డే మీల్స్ కార్మికులతో కలిసి తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా వంట తయారీ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్మికులకు వంట బిల్లులలతో పాటు, వేతనాలు విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్మికులు అశోక్, యశోద రెడ్డి, దూస వెంకటేశం, నర్సయ్య, జగీరు హారిక తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు

బోయినపల్లి: మండలంలోని తడగొండ పోచమ్మ ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గతంలో ఉన్న ఆలయం స్థానంలో నూతన ఆలయం నిర్మించేందుకు పాత ఆలయంలోని పోచమ్మ తల్లి తదితర విగ్రహాలను నూతనంగా నిర్మించిన బాలాలయంలో ప్రస్తుతం ప్రతిష్ఠించారు. శాంతిహోమం నిర్వహించి, గోవుతో పూజలు చేసి శాస్త్రోక్త పద్ధుతులతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. మహిళలు అమ్మవారిని కొలిచి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియామకం

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ సిరిసిల్ల చేనేత విభాగం పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బండారి అశోక్ నియామకమయ్యారు. శుక్రవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే.మహేందర్ రెడ్డి నియామకపత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన నేతలకు ఈసందర్భంగా అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	06	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	05	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	10	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	0	336

\- వేములవాడ

గ్రంథాలయ భవనం ప్రారంభానికి చర్యలు

సాక్షి స్పందన

వేములవాడఅర్బన్: వేములవాడ మండల పరిషత్ కాంప్లెక్స్‌లో నూతన గ్రంథాలయం నిర్మించి ప్రారంభించలేదని శనివారం 'సాక్షి'లో ''అలంకారప్రాయంగా గ్రంథాలయ భవనం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి స్పందించారు. గ్రంథాలయం భవనంలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నందున, కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లు చెల్లించాల్సి ఉన్నందున ప్రారంభించడం ఆలస్యం అవుతుందన్నారు. పంచాయతీరాజ్‌శాఖ వారు గ్రంథాలయ భవనం జిల్లా గ్రంథాలయ సంస్థకు అప్పగించిన వెంటనే ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కోనరావుపేట ప్రిన్సిపాల్‌కు అవార్డు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న సాగర్

కోనరావుపేట: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌ను విద్యాశాఖ కమిషనర్ అభినందించారు. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీయట్ ఫలితాల్లో 95 శాతం ఉత్తీర్ణతను సాధించింది. హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ కంకణాల సాగర్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సిరిసిల్లఅర్బన్: గడ్డి మందుతాగి ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌కు చెందిన బోయిని సదానందం(45) కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో అప్పులపాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో శనివారం గడ్డిమందు తాగాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన సదానందంను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తీసుకెళ్లారు.